
మనం
కృష్ణా / గుంటూరు
ఎన్టీఆర్ - బాపట్ల - పల్నాడు
శనివారం | 22 | ఆగస్టు | 2026 | పేజీలు: 9



## శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం

బూత్ లెవెల్ అధికారులు అందుబాటులో ఉండాలి
కలెక్టర్ సి.యం సాయికాంత్‌వర్మ

5 లో




# మహిళల ఆర్థిక స్వావలంబనకు 'రైజ్' మార్గదర్శి

పి.మీరాహుస్సేన్ ఖాన్

- శిక్షణలో పొందిన నైపుణ్యాలను ఉపాధి, స్వయం ఉపాధిగా మలుచుకోవాలి
- మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబానికి వెన్నుదన్నుగా నిలుస్తారు
- ఢిల్లీ నుంచి వచ్చిన ఓడిఓపి అధికారి ఇషాదీప్ సింగ్‌తో కలిసి ఎక్స్‌పోను పరిశీలించిన కలెక్టర్ లక్ష్మీశ

8 లో

-విజయవాడ, మనంబ్యూరో



# తొలిరోజు ప్రశాంతంగా సివిల్స్ మెయిన్స్..

పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయలు కల్పించాలి

5రోజుల పాటు పరీక్షలు

6 లో

# రోడ్డు భద్రతలో ఆదర్శ పట్టణంగా విజయవాడను నిలబెడదాం

- ఐడియల్ టౌన్ ఆన్ రోడ్ సేఫ్టీ ప్రాజెక్టుతో లక్ష్యాలను చేరుకుందాం
- ప్రమాద మరణాలు, క్షతగాత్రులను 10-15 శాతం తగ్గించడమే లక్ష్యంగా చర్యలు
- నాలుగు కీలక అంశాలతో సమగ్ర రోడ్డు భద్రత కార్యాచరణ
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

7 లో



# వర్షాకాలంలో హోమ్ హెల్త్ కేర్, వర్చువల్ డాక్టర్ సేవలను బలోపేతం చేసిన స్టార్ హెల్త్



**గాంధీనగర్ ఆగస్టు 21 మనం న్యూస్:** వర్షాకాలంలో డెంగ్యూ, వైరల్ జ్వరాలు, హెచ్1ఎన్1 వంటి శ్వాసకోశ ఇన్ఫెక్షన్లతో పాటు లెప్టోస్పైరోసిస్ వంటి సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్లో వర్చువల్ డాక్టర్ కన్సల్టేషన్లు, హోమ్ హెల్త్ కేర్ సేవలను స్టార్ హెల్త్ మరింత బలోపేతం చేసింది. 2025 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2026లో రాష్ట్రంలో హోమ్ హెల్త్ కేర్ సేవల వినియోగం దాదాపు 13 రెట్లు పెరిగినట్లు సంస్థ వెల్లడించింది. ముఖ్యంగా డెంగ్యూ, వైరల్ జ్వరాలు, శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల చికిత్స కోసం ఈ సేవలను అధికంగా వినియోగించినట్లు తెలిపింది. పాలసీదారులు 7200 222 333 నంబర్ ద్వారా 'టాక్ టు స్టార్' సేవలను సంప్రదించి హోమ్ హెల్త్ కేర్ కోసం 1, ముందుగా నిర్ణయించుకున్న ఆసుపత్రి అడ్మిషన్ సహాయం కోసం 2 నొక్కవచ్చు. అర్హత ఉన్న పాలసీదారులకు ఇంటి వద్ద వైద్యుల పర్యవేక్షణలో నర్సింగ్ కేర్, రక్త పరీక్షలు, ఆరోగ్య పర్యవేక్షణ, ఐవీ ఫ్లూయిడ్స్, ఇంజెక్షన్లు వంటి సేవలు అందుబాటులో ఉంటాయని సంస్థ తెలిపింది. పాలసీ లేని సాధారణ ప్రజలు కూడా స్టార్ హెల్త్ కస్టమర్ యాప్ ద్వారా 24 గంటల పాటు ఉచిత వర్చువల్ డాక్టర్ కన్సల్టేషన్ పొందవచ్చు. సకాలంలో వైద్య సలహాలు తీసుకోవడం ద్వారా వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి, అవసరమైన చికిత్సను త్వరగా ప్రారంభించ వచ్చని స్టార్ హెల్త్ బిజినెస్ హెడ్ శ్రీనివాస్ కేబీబీ తెలిపారు.

# 100 నగరాలకు ఉబర్ సేవల విస్తరణ

**గాంధీనగర్ ఆగస్టు 21 మనం న్యూస్:** భారత్లో ఉబర్ తన సేవలను మరో 100 నగరాలకు విస్తరిస్తున్నట్లు ప్రకటించింది. దీంతో దేశవ్యాప్తంగా ఉబర్ సేవలు అందుబాటులో ఉన్న నగరాల సంఖ్య 225కు చేరనుంది. ఈ విస్తరణలో భాగంగా ఆంధ్రప్రదేశ్లోని కాకినాడ, విజయనగరం, అనంతపురం, ఏలూరు, కడప, భీమవరం, ఒంగోలు, మదనపల్లె, నరసరావుపేట, మచిలీపట్నం, శ్రీకాకుళం, గుడివాడ నగరాల్లో ఉబర్ బైక్ సేవలు ప్రారంభం కానున్నాయి. రోజువారీ ప్రయాణాలు, తొలి-చివరి మైలు కనెక్టివిటీకి అందుబాటు ధరల్లో రవాణా సదుపాయాన్ని అందించడంతో పాటు స్థానిక డ్రైవర్లకు అనువైన ఆదాయ అవకాశాలు కల్పించడమే లక్ష్యమని ఉబర్ తెలిపింది. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఉబర్ విస్తరణను అభినందిస్తూ, చిన్న నగరాలను అనుసంధానించడంలో కొత్త రవాణా



పరిష్కారాలు కీలకమని పేర్కొన్నారు. ఉబర్ ఇండియా డైరెక్టర్ రిషాంత్ ఘోష్ మాట్లాడుతూ.. చిన్న నగరాల్లోనూ సరసమైన, సౌకర్యవంతమైన రవాణాకు డిమాండ్ పెరుగుతోందని, అందుకే బైక్ సేవలను విస్తరిస్తున్నామని తెలిపారు. కొత్త ప్రయాణికులకు పరిమిత కాలం తొలి ఉబర్ రైడ్లు ఉచితంగా అందించనున్నట్లు సంస్థ వెల్లడించింది. ఉబర్ బైక్ ప్రయాణాల్లో రియల్టైమ్ డ్రైవర్ ఐడీ చెక్, ఎస్ఓఎస్ బటన్, రైడ్ వివరాల షేరింగ్, నిరంతర సేఫ్టీ సపోర్ట్ వంటి భద్రతా ఫీచర్లు అందుబాటులో ఉంటాయని తెలిపింది.

# గృహిణుల నిస్వార్థ సేవకు 'ఘనం సోచ్'తో వందనం




**గుంటూరు, ఆగస్టు 21 మనం న్యూస్:** గృహిణుల నిస్వార్థ సేవలను, కుటుంబ నిర్మాణంలో వారి కీలక పాత్రను గుర్తించేందుకు టాటా టీ చక్ర గోల్ 'ఘనం సోచ్' పేరుతో కొత్త ప్రచారాన్ని ప్రారంభించింది. జీతం, నెలవారీ ఆదాయం వంటి సంప్రదాయ కొలమానాలతో గృహిణుల కృషిని అంచనా వేయలేమని ఈ ప్రచారం చాటిచెబుతోంది. ప్రతిరోజూ కుటుంబాన్ని చూసుకోవడం, ఇంటిని నిర్వహించడం, పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడం వంటి బాధ్యతలను నిర్వర్తించే మహిళల శ్రమ తరచూ గుర్తింపునకు నోచుకోదని సంస్థ పేర్కొంది. కుటుంబంలో నిజమైన విలువను సృష్టించేది ఏమిటనే అంశాన్ని ఆలోచింపజేసేలా ప్రచార కథనాన్ని రూపొందించింది. గృహ రుణం కోసం దరఖాస్తు చేసే సందర్భంలో ఇంట్లో ఎంతమంది ఉద్యోగం చేస్తున్నారని బ్యాంకర్ ప్రశ్నించగా.. భర్త ఇద్దరని చెబుతాడు. అయితే జీతం స్లిప్ అడిగినప్పుడు అతను ఒక్కదానినే చూపించగలుగుతాడు. భార్యకు జీతం లేకపోయినా కుటుంబాన్ని నడిపించడంలో ఆమె పాత్రను అత్తగారు వివరించే సన్నివేశం ద్వారా గృహిణి శ్రమకు విలువను చాటారు. టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ ప్రెసిడెంట్ శరత్ వర్మ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ తమకు కీలక మార్కెట్ అని తెలిపారు. 'ఘనం టీ, ఘనం ఆలోచన' అనే నమ్మకానికి 'ఘనం సోచ్' సహజ కొనసాగింపని, గృహిణుల నిశ్శబ్ద శక్తిని గుర్తించి గౌరవించడమే ప్రచారం ఉద్దేశమని పేర్కొన్నారు.

# పీఎం రాహత్, రాహ్-వీర్ పథకాలపై ఆటో డ్రైవర్లకు అవగాహన

- **ప్రమాద బాధితులను సకాలంలో ఆసుపత్రికి చేర్చడం ద్వారా ప్రాణాలు కాపాడాలి**
- **మైలవరం పోలీసులు**



**మైలవరం ఆగస్టు 21 మనం న్యూస్ :** రోడ్డు ప్రమాదాల్లో గాయ పడిన వారికి తక్షణ వైద్యం అందేలా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం రాహత్ మరియు ప్రమాద బాధితులను గోల్డెన్ అవర్లో ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు కాపాడే వారికి ప్రోత్సాహం అందించే రాహ్-వీర్ పథకాలపై స్థానిక పట్టణం లోని వివిధ ఆటో యూనియన్ల ప్రతినిధులు, ఆటో డ్రైవర్లకు పోలీసులు అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించడం ద్వారా వారికి సకాలంలో వైద్యం అందించి ప్రాణాలు కాపాడవచ్చని వివరిం చారు. పి ఎమ్ - రావత్ పథకం ద్వారా అర్హత కలిగిన రోడ్డు ప్రమాద బాధితులకు ప్రమాదం జరిగిన తేదీ నుంచి గరిష్ఠం గా 7 రోజుల వరకు, 1.5 లక్షల వరకు క్యాష్లెస్ చికిత్స అందించే విధానం ఉందని తెలిపారు. అదేవిధంగా, రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని గోల్డెన్ అవర్లో ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు కాపాడే రాహ్ - వీర్కు ₹25,000 ప్రోత్సాహక బహుమతి అందించే పథకం గురించి వివరించారు. ప్రమాద సమయంలో భయపడ కుండా మానవతా దృక్పథం తో స్పందించి క్షతగాత్రులను వెంటనే ఆసుపత్రికి తర లించాలని ఆటో డ్రైవర్ల కు సూచించారు. ఈ సందర్భంగా మైలవరం పట్టణంలో అమలు చేస్తున్న వన్ - వే ట్రాఫిక్ విధానానికి పూర్తిగా సహకరించాలని కోరారు. రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ ఆటోలు నిలిపి ట్రాఫిక్కు ఆటంకం కలిగించరాదని, నిర్దేశించిన ప్రదేశాల్లోనే ఆటోలు నిలపాలని సూచించారు. ఓవర్లోడ్, ఓవర్స్పీడ్, డ్రంకన్ డ్రైవింగ్కు పాల్పడరాదని స్పష్టం చేశారు. ప్రయాణికుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ వారితో బాధ్యతగా, మర్యాదగా, గౌరవంగా వ్యవహరించాలని సూచించారు. ఆటో డ్రైవర్లకు ఏవైనా సమస్యలు ఎదురైతే పోలీసుల దృష్టికి తీసుకు రావాలని, వాటి పరిష్కారానికి అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరిస్తూ, రోడ్డు భద్రత మరియు సామాజిక బాధ్యతలో ఆదర్శంగా నిలిచే ఉత్తమ ఆటో డ్రైవర్లను గుర్తించి ప్రతి నెల ప్రోత్సహించే కార్యక్రమం చేపట్టనున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు. ప్రమాద బాధితుడికి సకాలంలో సాయం - ఒక ప్రాణాన్ని కాపాడే అవకాశం.

# ఏఐ ప్లస్ స్మార్ట్ఫోన్ ధరలు రూ.2,000 వరకు పెంపు

**గాంధీనగర్, ఆగస్టు 21 మనం న్యూస్:** విడిభాగాలు, ముడిసరుకుల ధరలు పెరగడంతో ఎంపిక చేసిన స్మార్ట్ఫోన్ మోడళ్ల ధరలను రూ.2,000 వరకు పెంచుతున్నట్లు ఏఐ ప్లస్ స్మార్ట్ఫోన్ ప్రకటించింది. ఈ ధరల సవరణ తక్షణమే అమల్లోకి వస్తుందని తెలిపింది. స్మార్ట్ఫోన్ పరిశ్రమలో మెమరీ సహా కీలక విడిభాగాల ధరలు పెరగడంతోపాటు తయారీ, రవాణా, లాజిస్టిక్స్ వ్యయాలు కూడా గణనీయంగా పెరిగాయని కంపెనీ పేర్కొంది. ఈ వ్యయ ఒత్తిళ్లను ఎదుర్కొంటూనే వినియోగదారులకు అందుబాటు ధరల్లో ఉత్పత్తులను అందించేందుకు ఇప్పటివరకు అదనపు ఖర్చుల్లో గణనీయమైన భాగాన్ని సంస్థే భరించిందని తెలిపింది. అయితే పెరుగుతున్న ఇన్పుట్ వ్యయాల నేపథ్యంలో ఎంపిక చేసిన పరికరాలపై నియంత్రిత ధరల సవరణ తప్పనిసరైందని ఏఐ ప్లస్ స్మార్ట్ఫోన్ సీఈఓ, నెక్స్ట్క్వాంటమ్ షిఫ్ట్ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు మాధవ్ శేత్ తెలిపారు. భారతీయ వినియోగదారులకు అత్యుత్తమ సాంకేతికతను, విలువను అందించడమే తమ లక్ష్యమని చెప్పారు. ధరల పెంపు చేసినప్పటికీ అన్ని ఉత్పత్తుల్లో ధరకు తగిన అత్యుత్తమ అనుభవాన్ని అందించడంపై దృష్టి కొనసాగుతుందని కంపెనీ స్పష్టం చేసింది.




మార్కెట్, సరఫరా గొలుసులో మార్పులను నిశితంగా పరిశీలిస్తూ తమ పరికరాలను పోటీతత్వ ధరల్లో అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపింది.

# కేతవీరునిపాడులో శ్రీ కోదండ రామస్వామి దేవస్థానానికి శంకుస్థాపన

- **కూటమి నేతలతో కలిసి శంకుస్థాపన మహోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**

**నందిగామ,ఆగష్టు21(మనం న్యూస్):** నందిగామ మండలం, కేతవీరునిపాడు గ్రామంలో శుక్రవారం నూతనంగా నిర్మించనున్న శ్రీ కోదండ రామస్వామి వారి దేవస్థానం శంకుస్థాపన మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కూటమి నేతలతో కలిసి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సౌమ్య, శ్రీ కోదండ రామస్వామి వారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని



పెంపొందించడంతో పాటు, భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచేలా దేవస్థానం నిర్మాణం జరగడం సంతోషకరమని తెలిపారు.గ్రామ ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శంకుస్థాపన మహోత్సవాన్ని విజయవంతం చేశారు.





# కంచెల గ్రామంలో పోలీసుల 'పల్లె నిద్ర'

**స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలపై పోలీసుల అవగాహన**



**నందిగామ,ఆగష్టు21(మనం న్యూస్)**ః రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పడంతో పాటు ప్రజల మధ్య సోదరభావం, ఐకమత్యాన్ని కాపాడేందుకు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు నందిగామ పోలీసులు 'పల్లె నిద్ర' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నందిగామ టౌన్ సీఐ శ్రీ పి. శ్రీను కంచెల గ్రామంలో పర్యటించి గ్రామ ప్రజలతో సమావేశమయ్యారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తీసుకుంటున్న ముందస్తు చర్యలను ప్రజలకు వివరించారు.ప్రతి ఒక్కరికీ తమకు నచ్చిన అభ్యర్థికి స్వేచ్ఛగా ఓటు వేసే హక్కు ఉందని సీఐ తెలిపారు. రాజకీయ అభిప్రాయాలు వేరుగా ఉన్నప్పటికీ వ్యక్తిగత విభేదాలకు తావివ్వకుండా గ్రామంలో అందరూ అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉండాలని సూచించారు .ఎన్నికల సమయంలో ప్రత్యర్థి వర్గాల మధ్య గొడవలు, దాడులు, బెదిరింపులు, రెచ్చగొట్టే సోషల్ మీడియా పోస్టులకు పాల్పడరాదని హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అక్రమ మద్యం, డబ్బు పంపిణీ, ఓటర్లను ప్రలోభపెట్టడం, బెదిరింపులు, అక్రమ సమావేశాలు, ఆయుధాల ప్రదర్శన వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైనా శాంతిభద్రత లకు విఘాతం కలిగించే విధంగా వ్యవహరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని గ్రామస్థులను కోరారు.ఎన్నికలు వస్తాయి, పోతాయి.. కానీ గ్రామ ప్రజల మధ్య ఉన్న బంధాలు, స్నేహాలు, ఐకమత్యం శాశ్వతంగా ఉండాలి అని సీఐ పి. శ్రీను పేర్కొన్నారు. 'పల్లె నిద్ర' కార్యక్రమం ద్వారా పోలీసులు గ్రామ ప్రజలకు చేరువై వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు శాంతిభద్రతలపై అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. గ్రామంలో ఎలాంటి సమస్య తలెత్తినా ప్రజలు భయపడకుండా పోలీసులను సంప్రదించాలని, సమాచారం ఇచ్చే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నందిగామ పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖకు పూర్తిగా సహకరిస్తామని గ్రామస్థులు తెలిపారు.

# కమ్మవారిపాలెం గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమం



**నందిగామ,ఆగష్టు21(మనం న్యూస్)**ః రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో శాంతిభద్రతలను పరిరక్షిస్తూ, ప్రజలందరూ సోదరభావంతో, ఐకమత్యంగా ఉండేలా అవగాహన కల్పించేందుకు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ గారి ఆదేశాల మేరకు నందిగామ పోలీసుల ఆధ్వర్యంలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నందిగామ టౌన్ ఎస్సై శ్రీ కె. సూర్య వంశీ గురువారం కమ్మవారిపాలెం గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించి గ్రామ ప్రజలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో రాజకీయ అభిప్రాయాలు వేరుగా ఉన్నప్పటికీ వాటిని వ్యక్తిగత విభేదాలుగా మార్చుకోకుండా గ్రామ ప్రజలందరూ కలిసిమెలిసి ఉండాలని సూచించారు. ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి గొడవలు, ఘర్షణలు, బెదిరింపులు, దాడులు లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడరాదని హెచ్చరించారు. అలాగే మద్యం, డబ్బు పంపిణీ, ఓటర్లను ప్రలోభపెట్టడం, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టడం వంటి చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామంలో ఏవైనా సమస్యలు లేదా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. 'ఎన్నికలు తాత్కాలికం, గ్రామ ప్రజల మధ్య ఐకమత్యం శాశ్వతం అని పేర్కొంటూ, ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్సై శ్రీ కె. సూర్య వంశీ కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామంలో పల్లె నిద్ర



**నందిగామ,ఆగష్టు21(మనం న్యూస్)**ః రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పడంతో పాటు ప్రజల మధ్య సోదరభావం, ఐకమత్యం కొనసాగించేందుకు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు నందిగామ పోలీసుల ఆధ్వర్యంలోపల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా నందిగామ టౌన్ సీఐ శ్రీ పి. శ్రీను గురువారం కంచెల గ్రామంలో పర్యటించి గ్రామ ప్రజలతో సమావేశమయ్యారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, ప్రజలందరూ పరస్పర సహకారంతో, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించేందుకు పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యలను ప్రజలకు వివరించారు.ఎన్నికలు ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక ముఖ్యమైన ప్రక్రియ అని, ప్రతి ఒక్కరికీ తమకు నచ్చిన అభ్యర్థికి స్వేచ్ఛగా ఓటు వేసే హక్కు ఉందని సీఐ శ్రీ పి. శ్రీను గారు తెలిపారు. ఎన్నికల సమయంలో రాజకీయ అభిప్రాయాలు వేరుగా ఉన్నప్పటికీ వ్యక్తిగత విభేదాలకు తావివ్వకుండా, గ్రామంలో ప్రజలందరూ అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉండాలని సూచించారు. ఎన్నికల సందర్భంగా ప్రత్యర్థి వర్గాల మధ్య మాటామాటా పెంచుకోవడం, గొడవలకు దిగడం, దాడులు చేయడం, బెదిరింపులకు పాల్పడటం, సోషల్ మీడియా ద్వారా రెచ్చగొట్టే పోస్టులు పెట్టడం వంటి చర్యలకు ఎవరూ పాల్పడరాదని హెచ్చరించారు. అలాంటి చర్యల వల్ల గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అదేవిధంగా గ్రామంలో అక్రమ మద్యం, డబ్బు పంపిణీ, ఓటర్లను ప్రలోభపెట్టడం, బెదిరింపులు, అక్రమ సమావేశాలు, ఆయుధాల ప్రదర్శన వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు ఎవరూ పాల్పడరాదని తెలిపారు. ఎన్నికల సమయంలో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా వ్యవహరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని గ్రామ ప్రజలకు సూచించారు. ప్రజలు పోలీస్ శాఖకు సహకరించి గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ కోరారు. ఎన్నికలు వస్తాయి, పోతాయి కానీ గ్రామ ప్రజల మధ్య ఉన్న బంధాలు, స్నేహాలు, ఐకమత్యం శాశ్వతంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. పల్లె నిద్ర కార్యక్రమం ద్వారా పోలీసులు గ్రామ ప్రజలకు మరింత చేరువై, వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. గ్రామంలో ఎలాంటి సమస్య తలెత్తినా ప్రజలు భయపడకుండా పోలీసులను సంప్రదించాలని, సమాచారం ఇచ్చే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నందిగామ పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువత మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. గ్రామంలో శాంతియుత వాతావరణాన్ని కొనసాగిస్తూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖకు పూర్తిగా సహకరిస్తామని గ్రామస్థులు తెలిపారు.

# రేపు తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అంధ కళాకారుల లైవ్ ఆర్కెస్ట్రా కార్యక్రమం

**సప్తస్వర ఆర్కెస్ట్రా ఆర్గనైజర్ ఎస్. వి.చలం**



**గాంధీనగర్ ఆగస్టు 21 మనం న్యూస్:** శ్రీ తుమ్మలపల్లి కళాక్షేత్రం నందు సప్తస్వర ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో ఆగస్టు 23 ఆదివారం ఉదయం 7గం'నుండి సాయంత్రం వరకు అనాథ, మూగ, చెవిటి ,అంద వికలాంగుల చిన్నారుల ఆర్థిక సహాయార్థం ఘనంగా సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్ యస్.వి.చలం తెలిపారు. విజయవాడ గాంధీనగర్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనాథ వికలాంగుల ఆర్థిక సహాయం కోసం ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి అన్ని జిల్లాల నలుమూలల నుండి భారీ ఎత్తున అంధ కళాకారులు వస్తున్నారని నగర ప్రజలందరూ కూడా ఈ కార్యక్రమానికి విచ్చేసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సంగీత విభాగానికి ముఖ్య అతిథులుగా విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్.కె.ధ్యానచంద్ర,ఐపీఎస్. సరిత,అగ్నిమాపక అధికారి.అందే వెంకట పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తల్లపురెడ్డి శ్రీనివాసరావు, ధార రాంబాబు ,డేవిడ్ రాజు తదితరులు పాల్గొన్నారు..

# వరలక్ష్మి దేవిగా భక్తులకు దర్శనమిచ్చిన జగన్మాత



**నందిగామ,ఆగష్టు21(మనం న్యూస్)**ః నందిగామ పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి శ్రీ చక్ర మందిరం ఆలయంలో జగన్మాత వరలక్ష్మి భక్తులకు దర్శనమిచ్చింది, రెండవ శుక్రవారం తెల్లవారుజాము నుండి పుణ్య స్నానాల ఆచరించి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి అమ్మవారి శ్రీ చక్ర మందిరంలో వేద పండితులు మణికంఠ పాండే, రాజేష్ శర్మల ఆధ్వర్యంలో మహిళలు వరలక్ష్మి వ్రత పూజలు భక్తిశ్రద్ధలతో వేదొక్తంగా నిర్వహించారు.. ఆలయాల వద్ద ఆలయ కమిటీ సభ్యులు మహిళలకు పసుపు కుంకుమ పూలు గాజులు ప్రసాదాలు పంపిణీ చేశారు..

# భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రత పూజల్లో భక్తులు



**నందిగామ,ఆగష్టు21(మనం న్యూస్)**ః నందిగామ పట్టణంలోని శ్రీ మరిడి మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో జగన్మాత ప్రత్యేక అలంకరణలో వరలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిస్తున్న శ్రీ మరిడి మహాలక్ష్మి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చింది, రెండవ శుక్రవారం తెల్లవారుజాము నుండి పుణ్య స్నానాల ఆచరించి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు మణికంఠ పాండే, రాజేష్ శర్మల ఆధ్వర్యంలో మహిళలు వరలక్ష్మి వ్రత పూజలు భక్తిశ్రద్ధలతో వేదొక్తంగా నిర్వహించారు.. ఆలయాల వద్ద ఆలయ కమిటీ సభ్యులు మహిళలకు పసుపు కుంకుమ పూలు గాజులు ప్రసాదాలు పంపిణీ చేశారు.

# అమ్మవారికి బంగారు వడ్డానం సమర్పణ

**నందిగామ,ఆగష్టు21(మనం న్యూస్)**ః శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలోని శుక శ్యామలాంబ అమ్మవారికి స్వర్గీయ చలపాటి పూర్ణచంద్రరావు స్వరాజ్యలక్ష్మి కుటుంబ సభ్యులు బంగారు వడ్డాణం సమర్పించారు. నందిగామ పట్టణంలోని భక్తుల పాలిటి కోర్కెల తీర్చే కల్పతరువుగా, స్వయంభుగా వెలసిన శ్రీ శుక శ్యామలాంబ సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో శ్రావణ మాస రెండవ శుక్రవారం పర్వదినాన్ని పురస్కరించుకుని స్వర్గీయ చలపాటి పూర్ణచంద్రరావు స్వరాజ్యలక్ష్మి కుటుంబ సభ్యులు, విజయవాడ పట్టణాన్ని చెందిన కె నీలేశ్వరావు, రాజకుమారి, అమెరికా వాస్తవ్యులు వై. రవి సుధారాణి దంపతులు సౌజన్యంతో సుమారు పది లక్షల రూపాయల విలువ కలిగిన 73 గ్రాముల గజలక్ష్మి ప్రతిమలగలిగిన బంగారు వడ్డాణం వారి తరపున చలపాటి పార్థసారథి అమ్మవారికి సమర్పించారు, ఆలయ అర్చకులు బంగారు ఆభరణానికి సంపోక్షణ ప్రత్యేక పూజలు వేదొక్తంగా నిర్వహించారు. బంగారు ఆభరణాన్ని అందజేసిన చలపాటి కుటుంబ సభ్యులకు ఆలయ ఈవో కంచర్ల సురేష్, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వాసిరెడ్డి మురళి రాఘవ కుమార్, ఆలయ అర్చకులతో కలిసి స్వామివారి అమ్మవారి శేషవస్త్రం ప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనం చేశారు.



## ఘనంగా గోగినేని రవిచంద్ర కుమార్తె వివాహం

**నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**



**నందిగామ,ఆగష్టు21(మనం న్యూస్):** నందిగామ మండలం,పెద్దవరం గ్రామం నందు శుక్రవారం నాడు క్రక్స్ బయోటెక్ ఎండి గోగినేని రవిచంద్ర కుమార్తె వివాహమైన సందర్భంగా కూటమి నేతలతో కలిసి నూతన వధూవరులను వారి స్వగృహంలో కలుసుకొని కుటుంబ సభ్యులతో కలసి అక్షింతలు వేసి ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

## మాజీ సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్



**పలు రాజకీయ అంశాలపై వైయస్ జగన్ మోహన్ రెడ్డి తో చర్చలు**

**తాడేపల్లి,ఆగష్టు21(మనం న్యూస్):** తాడేపల్లి లోని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో అధినేత మరియు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డిని ఉమ్మడి కృష్ణా జిల్లా శాసనమండలి సభ్యులు డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ శుక్రవారం ఉదయం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు రాజకీయ అంశాలపై ఆయనతో చర్చించారు. అదేవిధంగా గత నాలుగు రోజులుగా జరిగిన శాసనమండలి సమావేశాల చర్చలను, ప్రభుత్వ వైఖరిని, మంత్రులు అవలంబిస్తున్న చర్యలను వైయస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టికి ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ తీసుకువెళ్లారు.

## వీరవల్లి లో నందిగం రవికుమార్,రమా సులోచన ఆధ్వర్యంలో ప్రతి రోజూ అన్నదానం

**నందిగం బాలస్వామి సీతామహాలక్ష్మి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ మేఘా సేవా కార్యక్రమం**

**హనుమాన్ జంక్షన్: ఆగస్ట్ 21 ( మనం న్యూస్ ):** అన్ని దానాలలోకి అన్నదానం చాలా గొప్పది. ఆకలితో ఉన్నవాడికి అన్నం పెడితే వచ్చే పుణ్యం వెయ్యి యజ్ఞాలు చేసినా రాదు అంటారు. అందుకే మన పెద్దలు 'అన్నదానం మహాదానం' అన్నారు.అటువంటి మహత్తర కార్యక్రమమైన అన్నదానానికి వీరవల్లికి చెందిన విద్యాదాత,వాణి విద్యానికేతన్ వ్యవస్థాపకులు, వితరణశీలి నందిగం రవికుమార్, రమా సులోచన దంపతులు చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి బాపులపాడు మండలం వీరవల్లి వాణి విద్యానికేతన్ అధినేత నందిగం రవికుమార్, రమా సులోచన దంపతుల ఆలోచనకు ప్రతిరూపం నందిగం బాలస్వామి ,సీతామహా లక్ష్మీ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్. ఆ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం వీరవల్లి గ్రామంలో అన్నపూర్ణ నిత్యాన్న మేఘా సేవా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం ముఖ్యఉద్దేశం పుట్టిన ఊరు అంపాపురం, నివసిస్తున్న గ్రామం వీరవల్లి లో ఎటువంటి ఆసరా లేని పెద్ద వయస్సు వారు,, అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న వారికి స్వయంగా ఇంటికి క్యారేజీల్లో భోజనం అందించే కార్యక్రమాన్ని చేపట్టారు. తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం నేరుగా ఇంటికి వెళ్లి రెండు పూట్ల భోజనం అందించే బృహత్తర ఆలోచన వచ్చినట్లు రవికుమార్ నందిగం చెప్పారు. అ ఆలోచనను ఆచరణలో పెట్టానని అన్నారు. విషయం తెలిసిన రాజ్యసభ మాజీ సభ్యులు కె వి పి రామచంద్రరావు ఫోన్లో అభినందనలు తెలియజేశారని ఆనందం వ్యక్తంచేశారు.ఒక రోజు అన్నదాన కార్యక్రమంలో పాల్గొంటానని ఆయన చెప్పినట్లు నందిగం తెలిపారు.అలాగే పలువురు తాను చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించి అభినందనలు తెలిపారని చెప్పారు. తాము తలపెట్టిన ఈ కార్యక్రమానికి తమ కుమార్తె అల్లుడు డాక్టర్ కంఠంనేని దుర్గా అపురూప,డాక్టర్ కంఠంనేని మహేంద్రనాథ్, కుమారుడు కోడలు నందిగం మోహన్ వంశీ, నందిగం సాయి దీప్తి వారి వంతు సహకారం అందించారని చెప్పారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమానికి వీరవల్లిలో వారి నివాసంలో శ్రీకారం చుట్టారు.గ్రామ ప్రముఖల చేతులు మీదుగా ఈ మేఘా సేవా కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు,మాజీ సర్పంచ్ లయన్ నందమూరి మురళీకృష్ణ ప్రసాద్,గ్రామ ప్రముఖులు గుండపనేని ఉమా వరప్రసాద్, వీరవల్లి సొసైటీ చైర్మన్ కలపాల నాని, కె వి పి కృష్ణ కుమార్, ఎం పి టి సి సభ్యులు అమృతపల్లి సూర్యనారా యణ,లయన్ లంక వెంకటేశ్వరరావు, నందమూరి సీతారామయ్య, రాయి గోపాలకృష్ణ కోడెబొయిన బాబి,వడ్లమూడి రమేష్, వల్లూరుపల్లి ధన కోటేశ్వరరావు,వేగుంట మల్లిఖార్జున్,లంక సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు, దేవీ నామస్మరణతో మారుమోగిన గృహాలు

**పామర్రు, ఆగష్టు 21 (మనం న్యూస్ ):** శ్రావణ మాస మహోత్సవాల వేళరెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరుపుకున్నారు. ప్రతి ఇల్లు లక్ష్మీదేవి కొలువైన దివ్య మందిరాన్ని తలపించింది. తెల్లవారుజామునే మేల్కొన్న మహిళలు ఇళ్లను శుభ్రం చేసి, ముంగిట రంగురంగుల ముగ్గులు వేసి, తోరణాలతో అలంకరించుకున్నారు.పూజా మందిరాల్లో ప్రత్యేకంగా కలశాన్ని స్థాపించి, వరలక్ష్మీ అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ముత్తయిదువులు పసుపు, కుంకుమ, తోరాలను సమర్పించి, మహాలక్ష్మి అష్టోత్తర శతనామ కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి రకరకాల పిండివంటలు, నైవేద్యాలను సమర్పించి వ్రత కథను భక్తితో ఆలకించారు. దేవీ నామస్మరణలు, మంగళ హారతుల వేదమంత్రాల ధ్వనులతో ప్రతి గృహం మారుమోగింది.పూజ అనంతరం మహిళలు ఒకరికొకరు వాయనాలు ఇచ్చుకుంటూ, ముత్తయిదువులకు తాంబూలాలు సమర్పించి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. కుటుంబ సభ్యులందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు కలగాలని మహిళలు ఆ లక్ష్మీదేవిని వేడుకున్నారు. దీంతో గ్రామాలు, పట్టణాల్లోని వీధులన్నీ ఆధ్యాత్మిక శోభతో సంతరించుకున్నాయి. ఆషాడం ముగించుకుని అత్తవారింటికి అడిగేట్టిన నవవధువు తన శక్తి కొలది పూజా దిగాలు నిర్వహించి సాయం సమయంలో సంధ్యవేళ ఆలయాల్లో చేరుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు. నూతన శోభతో ఆలయాలు ఎంతో కిటకిటలాడాయి.



## వైజాగ్ ఓపెన్ నేషనల్ కరాటే ఛాంపియన్షిప్‌కు హనుమాన్ జంక్షన్ విద్యార్థులు




**హనుమాన్ జంక్షన్: ఆగస్ట్ 21 ( మనం న్యూస్ ):** ఈ నెల 22 ,23వ తారీఖులలో వైజాగ్ లోని స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో జరిగబోయే ఓపెన్ నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలకు ఎన్నుకొనబడి సబ్ జూనియర్ కుమిటీ మరియు కటాస్ రెండు విభాగలలో పాల్గొనబోతున్న హనుమాన్ జంక్షన్ టైగర్ పవర్ కిక్ బాక్సింగ్ అండ్ కరాటే స్కూల్ విద్యార్థులు బాలికలు కే హారికా ధనలక్ష్మి (17), కే మేఘన (13),బి సంతోషిని (13),కే శ్రీ వర్షిత (11), ఏ తీక్షిక (5) మరియు బాలురు కట్టా మనోజ్ (12),షేక్ షఫీయుర్ రెహమాన్ (12), బి చోళా సత్య దేవ్ (12), కే లోకేష్ కుమార్ (14), ఏ తేజేశ్వర్ (10), లను స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని సత్య ప్రసాద్ అభినందించారు అలాగే కోచ్ కట్టా సుధాకర్ ని కూడా అభినందిస్తూ ఒక స్టూడెంట్ విజయంలో కోచ్ పాత్ర ఎంత ఉంటుందో అంతకన్నా ఎక్కువ తల్లిదండ్రుల యొక్క శ్రమ, పట్టుదల ఉంటాయని మెచ్చుకున్నారని, కానుమోలు జడ్పీ హైస్కూల్ లో తొమ్మిదవ తరగతి విద్యార్థిని బి సంతోషిని కి టోర్నమెంట్ ఫీజు నిమిత్తం 3000 రూపాయలు నగదు బహుమతి ఇస్తున్నానని తెలియజేసారని అందుకుగాను విద్యార్థిని తల్లి బంగారు దుర్గా భవాని కృతజ్ఞతలు తెలియచేసారని కోచ్ కట్టా సుధాకర్ తెలియచేశారు. ఒక విద్యార్థి తండ్రి తేలప్రోలు వాస్తవ్యులు అరసవెల్లి వెంకట దుర్గా రావు మాట్లాడుతూ ఎప్పుడూ లేని మార్షల్ ఆరట్స్ ని తేలప్రోలు కి పరిచయం చేసి అక్కడ సాయంత్రం బ్యాచ్ నడిపిస్తున్న కోచ్ కట్టా సుధాకర్ కి ధన్యవాదములు తెలిపారు.

## డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ!

**ఏళ్ల నిరీక్షణకు తెర.. కాంట్రాక్ట్ ఉద్యోగుల చిరకాల స్వప్నం సాకారం**

**క్రమబద్ధీకరణకు విశేష కృషి చేసిన ఎన్జీఓ రాష్ట్ర నాయకత్వానికి సన్మానం**

**ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు, ప్రభుత్వానికి కాంట్రాక్ట్ ఉద్యోగుల హృదయపూర్వక కృతజ్ఞతలు**

**ఎన్జీవో రాష్ట్ర నాయకత్వానికి, ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు**




**విజయవాడ,ఆగష్టు, 21,(మనం న్యూస్):**డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ (రెగ్యులరైజేషన్) ప్రక్రియ విజయవంతం కావడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. తమ చిరకాల స్వప్నాన్ని సాకారం చేసేందుకు అలుపెరగని కృషి చేసిన ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఏ. విద్యాసాగర్ ని, కాంట్రాక్ట్ ఉద్యోగుల అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం విజయవాడలోని ఎన్జీవో హోమ్లో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తమ సమస్య పరిష్కారానికి చొరవ చూపిన నాయకత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు మరియు అభినందనలు తెలియజేశారు.

### కీలక పాత్ర పోషించిన 'సాగర్-రమణ' నాయకత్వం:

ఈ సందర్భంగా డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ... ఏళ్ల తరబడి పెండింగ్లో ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ అంశాన్ని ఎన్జీవో రాష్ట్ర నాయకత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని కొనియాడారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో అధ్యక్షుడు విద్యాసాగర్ నిరంతరం శ్రమించారని తెలిపారు. వారి ప్రత్యేక చొరవతోనే ముఖ్యమంత్రి ఆమోదం, క్యాబినెట్ ఆమోదం లభించడమే కాకుండా, అసెంబ్లీలో బిల్లు పాస్ అయిందని గుర్తుచేశారు. ఆ తర్వాత డిపార్ట్మెంట్ ప్రాసెస్ చట్ట సవరణ (అమెండ్మెంట్) ద్వారా సెకండరీ హెల్త్ కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్కు మార్గం సుగమమైందని వారు స్పష్టం చేశారు. రాష్ట్ర ఎన్జీవో సంఘం చొరవతో 8000 మంది కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ కి మార్గం ముఖ్యమంత్రి ఆమోదంతో సగం అయిందని, ఇప్పుడు యాక్ట్ 30 సవరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదం లభించడంతో డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్కు కూడా మార్గం సుగమం అయిందని తెలిపారు.

### ముఖ్యమంత్రి, మంత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు:

ఏళ్ల తరబడి వేచి చూస్తున్న ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపి, వారి కుటుంబాలకు భరోసా కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, ఆర్థిక శాఖమాత్యులు పయ్యావుల కేశవ్ కి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, శాఖాధికారులకు మరియు సంబంధిత ప్రభుత్వ యంత్రాంగానికి డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు సమర్పించారు.

### కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు:

ఈ కృతజ్ఞతా కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కరెడ్ల అంజనీ కుమార్, కార్యదర్శి శ్రీదేవి, సహాయ కార్యదర్శితో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి భారీ సంఖ్యలో విచ్చేసిన కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఎన్జీవో సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రత్యేక క్యాంపెయిన్ డేస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**▶▶ తమ ఓటు హక్కు పొందాలని తెలియజేసిన నగర కమిషనర్**



**గుంటూరు నగరపాలక సంస్థ ఆగస్టు: 21 (మనం న్యూస్ ప్రతినిధి)**: శని, ఆదివారాల్లో స్పెషల్ క్యాంపెయిన్ డేస్ను సద్వినియోగం చేసుకోవాలి...తూర్పు ఈఆర్ఓ, కమిషనర్ మయూర్ అశోక్ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 22, 23 మరియు 29, 30 తేదీల్లో ప్రత్యేక క్యాంపెయిన్ డేస్ నిర్వహిస్తున్నట్లు గుంటూరు తూర్పు నియోజకవర్గ ఈఆర్ఓ, నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రత్యేక క్యాంపెయిన్ డేస్లో భాగంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో సంబంధిత బూత్ లెవెల్ అధికారులు ముసాయిదా ఓటర్ జాబితాతో పాటు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.ప్రజలు తమ ఓటు వివరాలను ముసాయిదా ఓటర్ జాబితాలో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. ఓటర్ జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకోవాలనుకునేవారు,పేరు లేదా ఇతర వివరాల్లో మార్పులు,చేర్పులు, సవరణలు చేయించుకోవాలనుకునేవారు, అలాగే ముసాయిదా ఓటర్ జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉన్నవారు సంబంధిత పోలింగ్ కేంద్రంలో అందుబాటులో ఉన్న బిఎల్ఓలను సంప్రదించి తమ దరఖాస్తులను అందించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ ప్రత్యేక క్యాంపెయిన్ డేస్ను సద్వినియోగం చేసుకుని తమ ఓటు వివరాలను పరిశీలించుకో వాలని,ఓటర్ జాబితాలో ఏవైనా తప్పులు లేదా మార్పులు అవసరమైతే నిర్ణీత ప్రక్రియ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. బిఎల్ఓలు నిర్దేశిత సమయంలో పోలింగ్ కేంద్రాల్లో ఉండి, ప్రజల నుండి అర్జీలు, దరఖాస్తులను తీసుకునేలా సూపర్వైజరీ అధికారులు, ఏఈఆర్ఓలు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

# శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు



**గుంటూరు, ఆగస్టు 21 : (మనం న్యూస్ ప్రతినిధి)** ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని శని,ఆదివారాల్లో నిర్వహిస్తున్నట్లుజిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సి.యం.సాయికాంత్ వర్మతెలిపారు.ఈ నెల 22, 23 తేదీలలోనూ, 29,30 తేదీల్లోను ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు.ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో సంబంధిత బూత్ లెవెల్ అధికారులు (బి.ఎల్.ఓ) ఆయా రోజుల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని అన్నారు. ముసాయిదా ఓటరు జాబితా బి.ఎల్.ఓల వద్ద లభ్యంగా ఉందని,ఓటర్లు తమ ఓటు వివరాలను ముసాయిదా ఓటరు జాబితాలో పరిశీలించుకోవాలని సూచించారు.ఓటరు జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకొనుటకు,వివరాల్లో మార్పులు,చేర్పులు, సవరణలు చేయుటకు సంబంధిత పోలింగ్ కేంద్రంలో బిఎల్ఓలను సంప్రదించి ఫారం 6, 7 లేదా 8 అందించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటును పదిలపరచుకోవాలని కోరారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమానికి వచ్చే వారికి స్పష్టమైన సమాచారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది



**▶▶ ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం**

**▶▶ ఎమ్మెల్యే గళ్ళా మాధవి**

**గుంటూరు పశ్చిమ ఆగస్టు: 21 (మనం న్యూస్ ప్రతినిధి)**: ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, అదే విధముగా జర్నలిస్టుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. శుక్రవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళామాధవి ప్రజా గ్రీవెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.అదే విధంగా గురువారం జరిగిన అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేయటం పాటు, వారి సమస్యలను పరిష్కరించాలని కోరటం పై హర్షం వ్యక్తం చేస్తూ పలు జర్నలిస్ట్ సంఘాల ఎమ్మెల్యే గళ్ళా మాధవిని కలుసుకొని ధన్యవాదాలు తెలిపి, సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు.ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను వినిపించారని, వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటుండటంతో ప్రజలు సంతృప్తిగా వెళ్తున్నారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అభివృద్ధి,సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ రాష్ట్రాభివృద్ధి,ప్రజాసంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందన్నారు. ప్రతి వర్గం,ప్రతి వృత్తి,ప్రతి సంస్థ అవసరాలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న ఏకైక నాయకుడు చంద్రబాబు నాయుడు అని కొనియాడారు.ఈ సందర్భంగా అసెంబ్లీలో జర్నలిస్టుల సంక్షేమంపై తాను ప్రస్తావించిన అంశాన్ని వివరించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి,ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభంగా ఉన్న జర్నలిస్టులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్నారని అన్నారు. ప్రజలకు నిజమైన సమాచారాన్ని చేరవేసేందుకు ఎన్నో కష్టాలు,ప్రమాదాలను ఎదుర్కొంటూ విధులు నిర్వర్తిస్తున్న జర్నలిస్టులకు కనీస భద్రత,సంక్షేమం అవసరమని పేర్కొన్నారు.అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులకు హౌసింగ్ సదుపాయం,ఆరోగ్య భద్రత కోసం హెల్త్ కార్డులు కల్పించాలని అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. జర్నలిస్టులు చాలా తక్కువ వేతనాలతో,నిరంతర ఒత్తిడిలో పనిచేస్తున్నప్పటికీ సమాజానికి సేవ చేస్తున్నారని అన్నారు.వారి కుటుంబాలకు భరోసా కల్పించే విధంగా గృహ వసతి,ఆరోగ్య భద్రత అందించాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టారని, జర్నలిస్టు కాలనీల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇచ్చారని గుర్తు చేశారు. జర్నలిస్టుల కోసం గతంలో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేసి, వారి సంక్షేమానికి మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. గత ఐదేళ్లలో అనేక వర్గాల మాదిరిగానే జర్నలిస్టుల సమస్యలు కూడా నిర్లక్ష్యానికి గురయ్యాయని విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రతి వర్గం సమస్యలపై దృష్టి సారిస్తోందని తెలిపారు. అమరావతి రాజధాని ప్రాంతంతో పాటు ప్రతి జిల్లా కేంద్రంలో జర్నలిస్టులకు హౌసింగ్ సదుపాయాలు లేదా ఇంటి స్థలాలు కేటాయించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని కోరినట్లు వెల్లడించారు.ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో హౌసింగ్ వంటి అంశాలపై నిర్ణయాలు తీసుకోవడం సవాలుతో కూడుకున్నప్పటికీ, ప్రతి వర్గానికి న్యాయం చేయాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జర్నలిస్టుల సమస్యలపై సానుకూలంగా స్పందిస్తారనే నమ్మకం ఉందని, రానున్న రోజుల్లో జర్నలిస్టుల హౌసింగ్, హెల్త్ కార్డుల అంశంపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారం, జర్నలిస్టుల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి అనే మూడు లక్ష్యాలతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.ప్రజలు ప్రభుత్వానికి సహకరించి కొంత సమయం ఇస్తే ప్రతి వర్గానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి విశ్వాసం వ్యక్తం చేశారు.



# పోలీసుల కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్



**గుంటూరు తూర్పు ఆగస్టు 21 (మనం న్యూస్ ప్రతినిధి)**: 'సంకల్పం' కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన.గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్,ఐపీఎస్ ఆదేశాల మేరకు,నేర నియంత్రణ,అసాంఘిక కార్యకలాపాల కట్టడి, ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడంలో భాగంగా ఓల్ గుంటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇజ్రాయిల్పేట, మణిపురం ఫ్లైఓవర్ సమీప ప్రాంతంలో శుక్రవారం తెల్లవారుజామున 05:00 గంటల నుంచి 08:00 గంటల వరకు విస్తృతంగా కార్డన్ సెర్చ్ నిర్వహించారు.ఈ కార్డన్ సెర్చ్ను ఈస్ట్ సబ్-డివిజన్ డీఎస్పీ సీతారాం, పర్యవేక్షణలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కొత్తపేట, లాలాపేట, ఓల్ గుంటూరు పోలీస్ స్టేషన్ల ఇన్స్పెక్టర్లు, సంబంధిత సబ్-ఇన్స్పెక్టర్లు, పోలీస్ సిబ్బంది, ఎస్టీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు. వాహనాల తనిఖీలు, పత్రాల పరిశీలన:కార్డన్ సెర్చ్లో భాగంగా అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు మరియు ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహనాల పత్రాలను పరిశీలించగా 46 ద్విచక్ర వాహనాలు మరియు ఒక ఆటోకు సంబంధించిన పత్రాలు అసంపూర్తిగా లేదా సక్రమంగా లేనట్లు గుర్తించారు. సంబంధిత వాహనాలపై నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపడుతున్నారు .పోలీసులు నిర్వహిస్తున్న ఇటువంటి తనిఖీల ప్రధాన ఉద్దేశ్యం నేరాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు, అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులను గుర్తించడం, ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించడం మరియు శాంతిభద్రతలను పరిరక్షించడం. 'సంకల్పం'లో భాగంగా మాదకద్రవ్యాలపై అవగాహన:కార్డన్ సెర్చ్ అనంతరం 'సంకల్పం' కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రజలకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీసు అధికారులు డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు,మత్తు ఇంజెక్షన్లు మరియు మత్తు మాత్రల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, కుటుంబ, సామాజిక దుష్ప్రభావాలను వివరించారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాలకు బానిస కాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు .మాదకద్రవ్యాల వినియోగం, కలిగి ఉండటం, విక్రయించడం, అక్రమ రవాణా చేయడం వంటి చర్యలకు పాల్పడితే ఎన్ డి పి ఎస్ చట్టం ప్రకారం కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. అదేవిధంగా,తమ పరిసర ప్రాంతాల్లో గంజాయి ,డ్రగ్స్ లేదా ఇతర మాదకద్రవ్యాల అక్రమ విక్రయాలు ,రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. ప్రజల సహకారంతోనే మాదకద్రవ్యాల రహిత సమాజాన్ని నిర్మించగలమని అధికారులు పేర్కొన్నారు.ఈ అవగాహన కార్యక్రమంలో సుమారు 150 మంది స్థానిక ప్రజలు పాల్గొన్నారు. మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, వాటి వల్ల కలిగే నష్టాలు, చట్టపరమైన పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మరియు సంకల్పం ప్రతిజ్ఞ చేయించారు.నేర నియంత్రణకు నిరంతర చర్యలు:గుంటూరు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో నేర నియంత్రణ, మాదకద్రవ్యాల అక్రమ రవాణా నివారణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడి మరియు ప్రజల భద్రత కోసం ప్రత్యేక నిఘా,వాహన తనిఖీలు, కార్డన్ సెర్చ్ మరియు అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా పోలీసులకు సహకరించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలపై సమాచారం అందించి సురక్షితమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పోలీసులు కోరారు.

# యువతలో పారిశ్రామిక ఆలోచనలకు బాటలు



**▸▸ ఆర్టీఐహెచ్లో ఐదు రోజుల శిక్షణా శిబిరం ముగింపు**

**విజయవాడ,ఆగష్టు,21,(మనం న్యూస్):** రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్టీఐహెచ్), విజయవాడ-ఎనికేపాడు ఆధ్వర్యంలో ఆగస్టు 17 నుంచి 21 వరకు నిర్వహించిన ఐదు రోజుల పారిశ్రామికవేత్తల శిక్షణా శిబిరం శుక్రవారం విజయవంతంగా ముగిసింది. ప్రపంచ పారిశ్రామికవేత్తల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణా శిబిరంలో పీబీ సిద్ధార్థ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థులతో పాటు సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పారిశ్రామిక ఆలోచనా విధానం, సమస్యలను గుర్తించడం, వినూత్న పరిష్కారాలను రూపొందించడం, వ్యాపార ఆలోచనలను అభివృద్ధి చేయడం వంటి అంశాలపై వారికి అవగాహన, శిక్షణ అందించారు.కార్యక్రమంలో భాగంగా 21 వినూత్న వ్యాపార ఆలోచనలను విద్యార్థులు నిపుణుల ముందు ప్రదర్శించారు. పౌర సేవలు, ప్రజా రవాణా, ఆరోగ్యం, స్వచ్ఛమైన తాగునీరు, వ్యవసాయం తదితర రంగాలకు సంబంధించిన ఆలోచనలను విద్యార్థులు వివరించారు. నిపుణులు విద్యార్థులకు విలువైన సూచనలు, మార్గదర్శకత్వం అందించారు. ఈ సందర్భంగా ఆర్టీఐహెచ్ విజయవాడ ముఖ్య కార్యనిర్వహణ అధికారి డా. హరి బాబు మాట్లాడుతూ యువతలో సృజనాత్మక ఆలోచనలు, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఆర్టీఐహెచ్ అందిస్తున్న అవకాశాలను వివరించారు. వినూత్న ఆలోచనలను ఆచరణలోకి తీసుకువచ్చి భవిష్యత్లో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఐదు రోజుల శిక్షణా శిబిరం విద్యార్థులకు ఆవిష్కరణలు, పారిశ్రామిక ఆలోచనలు, శిక్షణ, మార్గదర్శకత్వానికి మంచి వేదికగా నిలిచింది. కార్యక్రమం విజయవంతం కావడంలో ఆర్టీఐహెచ్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు.

# ప్రత్యేక క్యాంపెయిన్ డేస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**▸▸ ఓటర్ జాబితాలో తమ వివరాలను పరిశీలించుకోవాలి**

**▸▸ వీఎంసీ కమిషనర్, డెప్యూటీ జిల్లా ఎన్నికల అధికారి ధ్యానచంద్ర**

**విజయవాడ,ఆగష్టు,21,(మనం న్యూస్):** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 22, 23 మరియు 29, 30 తేదీల్లో అనగా శని, ఆదివారాల్లో ప్రత్యేక క్యాంపెయిన్ డేస్ నిర్వహిస్తున్నట్లు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ మరియు డెప్యూటీ జిల్లా ఎన్నికల అధికారి ధ్యానచంద్ర తెలిపారు. ఈ ప్రత్యేక క్యాంపెయిన్ డేస్లో భాగంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో సంబంధిత బూత్ లెవెల్ అధికారులు (బిఎల్ఓలు) ముసాయిదా ఓటర్ జాబితాతో పాటు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని కమిషనర్ పేర్కొన్నారు. ప్రజలు తమ ఓటు వివరాలను ముసాయిదా ఓటర్ జాబితాలో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని ఆయన సూచించారు. ఓటర్ జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకోవాలనుకునేవారు, పేరు లేదా ఇతర వివరాల్లో మార్పులు, చేర్పులు, సవరణలు చేయించుకోవాలనుకునేవారు, అలాగే ముసాయిదా ఓటర్ జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉన్నవారు సంబంధిత పోలింగ్ కేంద్రంలో అందుబాటులో ఉన్న బి.యల్ ఓలను సంప్రదించి తమ దరఖాస్తులను సమర్పించుకోవచ్చని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఈ ప్రత్యేక క్యాంపెయిన్ డేస్ను సద్వినియోగం చేసుకుని తమ ఓటు వివరాలను పరిశీలించుకోవాలని, ఓటర్



జాబితాలో ఏవైనా తప్పులు లేదా మార్పులు అవసరమైతే నిర్ణీత ప్రక్రియ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ప్రజలకు ఓటర్ జాబితా సంబంధిత సందేహాలు, సహాయం అవసరమైన పక్షంలో ఎన్టీఆర్ జిల్లా హెల్ప్లైన్ నంబర్ 9154970454ను సంప్రదించాలని సూచించారు.

# రంగాపురంలో పాముకాటుకు అంగన్వాడీ టీచర్ మరణం



**వీరులపాడు ఆగష్టు 21 మనం న్యూస్:** వీరులపాడు జుజ్జూరు మండల కేంద్రంలో రంగాపురం గ్రామంలో అంగన్వాడీ టీచర్ గా పని చేస్తున్న వినుప నూరి బుజ్జిత 58 సంవత్సరాలు పాము కాటు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రోజున మృతి చెందింది. సేకరించిన సమాచారం మేరకు రంగాపురం గ్రామంలో గత 30 సంవత్సరాల నుండి అంగన్వాడీ టీచర్ గా పని చేస్తూ గ్రామంలో ఉన్న చిన్న పిల్లలకు బాలింతలకు గర్భిణీ స్త్రీలకు ప్రభుత్వ నిబంధన మేరకు సకాలంలో పౌష్టికాహారం అందించే వారిని గ్రామస్తులు తెలిపారు మంచి అంగన్వాడీ టీచర్ని కోల్పోయామని విచారణ వ్యక్తం చేస్తూ నివాళులర్పించారు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు భర్త వ్యవసాయ కూలి పనులతో జీవిస్తూ ఉంటారు బుజ్జితకు జోహార్లు సంతాపన తెలియజేసిన వారు లాల్ అహ్మద్ గౌస్ సిఐటియు వీరులపాడు మండల కమిటీ ఎన్టీఆర్ జిల్లా అంగన్వాడి కమిటీ ప్రధాన కార్యదర్శి సుప్రజ వీరులపాడు మండల సిపిఎం మండల కమిటీ నాయకులు కార్యదర్శి చాట్ల రవి ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ అంగన్వాడీ సమస్యల కోసం అనేక పోరాటాలు నిర్వహించవమని ప్రభుత్వాలు మారుతున్న వారి సమస్యలు పరిష్కరించలేదని ఆర్థిక పరిస్థితుల వల్ల సరైన వైద్యం చేయించుకోలేక అంగన్వాడీ టీచర్ ఇనుపనేరి మృతి చెందారు ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# దోమల నివారణకు ప్రజల సహకారం ఎంతో అవసరం



**▸▸ నగరపాలక సంస్థ బయాలజీ సూర్యకుమార్ నాయక్**

**విజయవాడ, ఆగష్టు, 21,(మనం న్యూస్):** విజయవాడ నగరంలో దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రజలు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని నగరపాలక సంస్థ బయాలజీ సూర్యకుమార్ నాయక్ అన్నారు . కమిషనర్ ఆదేశాల మేరకు చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ ఇన్చార్జి గోపాల నాయక్ సూచనలతో బయాలజిస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం శాంతినగర్లో డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇళ్లలో, పరిసర ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటిని పరిశీలించారు. నీటి నిల్వల్లో దోమల లార్వా కనిపించిన ప్రాంతాల్లో వెంటనే లార్వా నివారణ చర్యలు చేపట్టారు. దోమల లార్వా వృద్ధి చెందకుండా ఇంటి లోపల, బయట ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం డ్రైడేలో భాగంగా ఇళ్ల పరిసరాల్లోని చిన్నచిన్న వస్తువుల్లో కూడా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సిబ్బంది సూచించారు. ముఖ్యంగా పూల కుండీలు, కొబ్బరి చిప్పలు, పాత బకెట్లు, కూలర్లు, వాటర్ బాటిళ్లు, టైర్లు తదితర వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా ఖాళీ చేయాలని తెలిపారు. నగరంలో దోమల సమస్యను నివారించేందుకు విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఫాగింగ్, యాంటీ లార్వా ఆపరేషన్లు, కాలువల్లో పూడికతీత వంటి చర్యలు నిరంతరం చేపడుతున్నప్పటికీ, ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో కీలకమని అధికారులు తెలిపారు. ప్రతి ఇంటిలో ప్రతి ఒక్కరూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటిస్తూ నీటి నిల్వలను తొలగించినప్పుడే దోమల ఉత్పత్తిని సమర్థవంతంగా అరికట్టవచ్చని, తద్వారా దోమల ద్వారా వ్యాపించే అనారోగ్య సమస్యలను నివారించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో మలేరియా ఇన్స్పెక్టర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, ఆశా వర్కర్లు, పారిశుద్ధ్య కార్మికులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



# తొలిరోజు ప్రశాంతంగా సివిల్స్ మెయిన్స్..





**పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

**విజయవాడ,ఆగష్టు,21,(మనం ప్రతినిధి):** యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సివిల్ సర్వీసెస్ మెయిన్ పరీక్షలు శుక్రవారం విజయవాడ కేంద్రంలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. నగరంలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్నిజిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తనిఖీ చేశారు. తొలిరోజు పేపర్-1 ఎస్సే పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో అభ్యర్థులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించి, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా ఏర్పాట్లను కొనసాగించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ మెయిన్ పరీక్షలు ఈ నెల 21వ తేదీ, 22వ తేదీ, 23వ తేదీ, 29వ తేదీ, 30వ తేదీల్లో అయిదు రోజులు పాటు పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. తొలిరోజు మాత్రం ఉదయం సెషన్లో మాత్రమే పరీక్ష ఉందని.. మిగిలిన రోజుల్లో ఉదయం, మధ్యాహ్నం కూడా పరీక్షలు జరుగుతాయన్నారు. విజయవాడలోని పరీక్షా కేంద్రంలో 124 మంది అభ్యర్థులకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. పరీక్షా కేంద్రంలో నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు, వైద్య సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు తదితర అన్ని మౌలిక సదుపాయాలు అందు బాటులో ఉండేలా చూస్తున్నామన్నారు. అ భ్యర్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకునేలా వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక ప్రజా రవాణా సదుపాయాలను కల్పించా మని.. భద్రత పరంగా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి అన్ని విధాల సహాయ సహకారాలు అందించేందుకు 91549 70454 నంబర్తో కంట్రోల్ రూమ్ కూడా సేవలందిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. పరీక్షల తొలిరోజు శుక్రవారం పేపర్ - 1 (ఎస్సే)కు 120 మంది అభ్యర్థులు హాజరుకాగా నలుగురు గైర్హాజరయ్యారు.



# ఆడపిల్లల వెంటపడితే కటకటాల వెనక్కే!



**ప్రేమ పేరుతో వేధింపులు చేస్తే కఠిన చర్యలు**

**రౌడీషీట్ ప్రతిపాదనకూ వెనుకాడం**

**బాలికలు, మహిళల భద్రత విషయంలో రాజీ లేదు:పోలీసులు**

మైలవరం ఆగస్టు 21 మనం న్యూస్ :మైనర్ బాలికను సుమారు ఏడాది కాలంగా పాఠశాల, ట్యూషన్, ఇంటికి వెళ్లే సమయంలో ద్విచక్ర వాహనంపై వెంబడిస్తూ, ప్రేమ పేరుతో వేధించి, బెదిరింపులకు పాల్పడిన కేసులో సాయిరి ఆనందబాబు (24), కొత్తగూడెం, పుల్లూరు గ్రామం, మైలవరం మండలంను మైలవరం పోలీసులు 21-08-2026న అరెస్టు చేసి రిమాండ్కు తరలించారు. బాలిక నిరాకరించినప్పటికీ నిందితుడు తన ప్రవర్తన మార్చు కోకుండా వెంటపడు తూ వేధింపులు కొన సాగించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. గతంలో గ్రామ పెద్దల సమక్షంలో హెచ్చరించినప్పటికీ మార్పు రాకపోవడంతో, నమోదైన కేసులో బి ఎన్ ఎస్ మరియు పోక్సో యాక్ట్ కింద చట్టపరమైన చర్యలు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా నిందితుడి వద్ద నుంచి మూడు మొబైల్ ఫోన్లు, నేరానికి ఉపయోగిం చిన కత్తి, అలాగే బాలికను వెంబడించడానికి ఉపయోగించిన ఏపీ 40 ఇ ఎక్స్ 4691 నంబరు గల బ్లూ కలర్ యమహా ఆర్ 15 ద్విచక్ర వాహనాన్ని కేసు ప్రాపర్టీగా సీజ్ చేశారు. వేధింపులకు పాల్పడితే భవిష్యత్తునే ప్రమాదంలో పడేసుకున్నట్టే, ఆడపిల్లలు మరియు మహిళలను వెంటపడటం, అసభ్యంగా ప్రవర్తించడం, ప్రేమ పేరుతో ఒత్తిడి చేయడం, బెదిరిం చడం, వాహనాలతో వెంబడించి భయాందోళనకు గురిచేయడం వంటి చర్యల ను పోలీసులు తీవ్రంగా పరిగణిస్తారు. ఇటువంటి నేరాలకు పాల్పడితే అరెస్టు, రిమాండ్తో పాటు నేరానికి ఉపయోగించిన వాహనాలు, ఇతర వస్తువుల సీజ్ సహా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవు. ప్రస్తుత కేసులో నిందితుడి ప్రవర్తన, కేసు పరిస్థితులు, చట్టపరమైన అర్హతలను పరిశీలించి అతనిపై రౌడీషీట్ తెర వడానికి సంబంధిత అధి కారులకు ప్రతిపాదన పంపే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు. ఇటువంటి క్రిమినల్ కేసులు వ్యక్తి భవిష్యత్తు, ఉపాధి అవకాశాలు, సామాజిక జీవితంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని యువత గుర్తించాలి. ప్రేమ పేరుతో వేధించడం ప్రేమ కాదు - నేరం. ఆడపిల్లల వెంటపడి తే పోలీసుల చర్య వెంటపడుతుంది.తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన, స్నేహాలు, వాహనాల వినియోగం మరియు రోజువారీ కదలికలపై బాధ్యతా యుతమైన పర్యవేక్షణ ఉంచి, వారు ఇటువంటి నేరప్రవర్తన వైపు వెళ్లకుండా ముందుగానే మార్గనిర్దేశం చేయాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# డా.బూర్ల రామాంజనేయులు 26 వ రోజు ఇంటింటికి తెలుగుదేశం విజయవంతం



**సీసీ రోడ్డు, డ్రైన్ హిందూ స్మశాన వాటిక నిర్మాణ పనులకు శ్రీకారం**

**గుంటూరు పత్తిపాడు ఆగస్టు: 21 (మనం న్యూస్ ప్రతినిధి)** వట్టిచెరుకూరు మండలం, కారంపూడిపాడు గ్రామంలో నిర్వహించిన కూటమి ప్రభుత్వం రెండేళ్ల అభివృద్ధి -సంక్షేమం ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం రూ.10 లక్షల( ఎంజిఎన్ఆర్ఈజియస్ )నిధులతో సిసి రోడ్డు మరియు కాల్వల నిర్మాణ పనులు మరియు రూ.10 లక్షల ఎంపి లారడ్స్ నిధులతో హిందూ స్మశాన వాటిక అభివృద్ధి పనులను ప్రారంభించిన ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు డా.బూర్ల రామాంజనేయులు, పాల్గొన్నారు.ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం, గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ,వారి సమస్యలను నేరుగా తెలుసుకున్నారు.గత రెండేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి,కరపత్రాలు పంపిణీ చేశారు.కారంపూడిపాడు గ్రామ ప్రజల చిరకాల అవసరాలను గుర్తించి సీసీ రోడ్డు,డ్రైన్ నిర్మాణ పనులతో పాటు హిందూ స్మశాన వాటిక అభివృద్ధి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు.ప్రత్తిపాడు నియోజకవర్గంలో ప్రజల మౌలిక వసతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని,గ్రామాలు,పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రామాంజనేయులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు మహిళలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతలో ఆదర్శ పట్టణంగా విజయవాడను నిలబెడదాం



**ఐడియల్ టౌన్ ఆన్ రోడ్ సేఫ్టీ ప్రాజెక్టుతో లక్ష్యాలను చేరుకుందాం**

**ప్రమాద మరణాలు, క్షతగాత్రులను 10-15 శాతం తగ్గించడమే లక్ష్యంగా చర్యలు.**

**నాలుగు కీలక అంశాలతో సమగ్ర రోడ్డు భద్రత కార్యాచరణ**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

విజయవాడ,ఆగష్టు, 21,(మనం న్యూస్): రోడ్డు భద్రతలో విజయవాడను ఆదర్శ పట్టణంగా ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని.. అదేవిధంగా లక్ష్యాల సాధనకు ఐడియల్ టౌన్ ఆన్ రోడ్ సేఫ్టీ కార్యక్రమం దోహదం చేస్తుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.విజయవాడను రోడ్డు భద్రతలో ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఐడియల్ టౌన్ ఆన్ రోడ్ సేఫ్టీ ప్రాజెక్టుకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆవిష్కరించారు.హోండా ఇండియా ఫౌండేషన్ సీఎస్ఆర్ భాగస్వామిగా, ట్రాక్స్ - రోడ్ సేఫ్టీ ఎన్జీవో అమలు సంస్థగా ఈ ప్రాజెక్టును చేపడుతున్నాయి. రవాణా, పోలీస్ శాఖల సహకారంతో కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల వల్ల సంభవించే మరణాలు, క్షతగాత్రులను 10-15 శాతం మేర తగ్గించడం, ప్రజల్లో రోడ్డు భద్రతపై బాధ్యతాయుతమైన ప్రవర్తనను పెంపొందించడం ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమన్నారు. ఈ ప్రాజెక్టును ప్రధానంగా ఇంజినీరింగ్, ఎన్ఫోర్స్మెంట్, ఎడ్యుకేషన్, ఎమర్జెన్సీ కేర్ అనే నాలుగు అంశాల ఆధారంగా అమలు చేయడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా బ్లాక్స్పాట్లలో మౌలిక వసతుల లోపాలను గుర్తించి సరిచేయడం, జీరో టాలరెన్స్ జోన్ల ద్వారా ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేయడం, 105 పాఠశాలలు, 14 కళాశాలల్లో సుమారు 70 వేల మంది విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడం, హెల్మెట్, సీటుబెల్ట్, లేన్ క్రమశిక్షణ, పాదచారుల భద్రతపై ప్రచారం నిర్వహించడం, అలాగే ప్రమాదాల సమయంలో సకాలంలో ప్రాథమిక సహాయం అందించేందుకు ఫస్ట్ రెస్పాండర్లకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. రోడ్డు ప్రమాద మరణాలను తగ్గించేందుకు ప్రభుత్వ శాఖలు, పోలీస్, ప్రైవేటు సంస్థలు, విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ఇతర భాగస్వామ్య సంస్థలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి సమన్వయంతో పనిచేయడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో హోండా ఇండియా ఫౌండేషన్ ప్రతినిధులతో పాటు విజయవాడ-ఎన్హెచ్ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ విద్యాసాగర్, ట్రాక్స్ - రోడ్ సేఫ్టీ ఎన్జీవో (ఢిల్లీ) జనరల్ సెక్రటరీ రజనీ గాంధీ, రీజినల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎం. వాసు తదితరులు పాల్గొన్నారు.



# రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయం



**ఎమ్మెల్యే డా.బూర్ల రామాంజనేయులు**

**గుంటూరు పత్తిపాడు ఆగస్టు: 21 (మనం న్యూస్ ప్రతినిధి)** వట్టిచెరుకూరు మండలం,కారంపూడిపాడు గ్రామం వద్ద జల్లివాగులో పేరుకుపోయిన పూడికను తొలగించి, నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం లేకుండా చేయడంతో పాటు వర్షాకాలంలో ముంపు సమస్యలను తగ్గించే లక్ష్యంతో రూ.10 లక్షల వ్యయంతో జల్లివాగు పూడికతీత పనులకు శంకుస్థాపన చేసి, పనులను ప్రారంభించిన గౌరవ ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు డా. బూర్ల రామాంజనేయులు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలను గుర్తించి, వాటికి శాశ్వత పరిష్కారం చూపడమే తమ ప్రధాన లక్ష్యమని. జల్లివాగు పూడికతీతతో నీటి ప్రవాహం మెరుగుపడి, పరిసర ప్రాంతాల రైతులకు మరియు ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని,జల్లివాగులో పూడిక తొలగించడం ద్వారా నీటి ప్రవాహం సజావుగా సాగడంతో పాటు, వర్షాకాలంలో నీరు నిలిచిపోయే పరిస్థితులను గణనీయంగా తగ్గించేందుకు అవకాశం ఉంటుందని, రైతు సంక్షేమమే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నాయకత్వంలో కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, రైతులు,సంబంధిత అధికారులు, అభిమానులు, కార్యకర్తలు,స్థానిక ప్రజలు మరియు తదితరులు పాల్గొన్నారు.






# మహిళల ఆర్థిక స్వావలంబనకు ‘రైజ్’ మార్గదర్శి

- శిక్షణలో పొందిన నైపుణ్యాలను ఉపాధి, స్వయం ఉపాధిగా మలుచుకోవాలి
- మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబానికి వెన్నుదన్నుగా నిలుస్తారు





(విజయవాడ,మనం బ్యూరో): మహిళలు శిక్షణ ద్వారా పొందిన నైపుణ్యాలు, అనుభవాన్ని వినూత్న ఆలోచనలతో మేళవించి వివిధ ఉత్పత్తులను తయారు చేసి, వాటిని మార్కెటింగ్ చేసుకోవడం ద్వారా ఆర్థికంగా ఎదిగేందుకు ‘రైజ్’ కార్యక్రమం చుక్కానిలా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి రైజ్ కేంద్రంలో నిర్వహించిన క్రాఫ్ట్ అండ్ ఆరట్స్ సెల్ఫ్ ఎంప్లాయ్మెంట్ మినీ ఎక్స్పోను శనివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఢిల్లీ నుండి వచ్చిన ఓడిఓపి అధికారి ఇషాదీప్ సింగ్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో ప్రతి మహిళ తనకంటూ ఒక నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకుని స్వశక్తితో ఎదగాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. మహిళ ఆర్థికంగా బలపడినప్పుడు కుటుంబానికి ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలవడంతో పాటు, కుటుంబ జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుత జీవనశైలి అధిక ఖర్చులతో ముడిపడి ఉందని, కుటుంబ అవసరాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో మహిళలు తమకు ఆసక్తి ఉన్న రంగంలో ఏదో ఒక పనిని ఉపాధిగా లేదా వ్యాపకంగా చేపట్టి ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ సూచించారు. మహిళల కలలను కార్యరూపంలోకి తీసుకురావడానికి ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా కోట్లాది రూపాయల రుణాలను అందిస్తోందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు చిన్నతరహా వ్యాపారాలను ప్రారంభించడంతో పాటు, తాము నేర్చుకున్న నైపుణ్యాలకు అనుగుణంగా ఉత్పత్తులను తయారు చేసి విక్రయించడం ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకో వచ్చన్నారు. ప్రతి మహిళ ఏదో ఒక నైపుణ్యాన్ని కలిగి ఉండేలా రైజ్ కేంద్రంలో వివిధ రకాల శిక్షణా కోర్సులను ర్వహిస్తున్నామని తెలిపారు. శిక్షణ పొందిన మహిళలు కేవలం శిక్షణతో ఆగిపోకుండా, తమ నైపుణ్యాలను ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్, బ్రాండింగ్ తదితర అంశాలతో అనుసంధానం చేసుకుని స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగాలని సూచించారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల వివరాలను అడిగి తెలుసుకున్న ఆయన, వాటి ఉత్పత్తి వ్యయం, విక్రయ ధర, మార్కెటింగ్ విధానం, బ్రాండింగ్, ఉత్పత్తులకు లభిస్తున్న ఆదరణ తదితర అంశాలపై మహిళలతో చర్చించారు. ఉత్పత్తుల నాణ్యతను మరింత మెరుగుపరచడంతో పాటు, వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా కొత్త ఉత్పత్తులను రూపొందించాలని సూచించారు. మంచి ఉత్పత్తి తయారీతో పాటు దానికి సరైన మార్కెటింగ్, ఆకర్షణీయమైన ప్యాకేజింగ్, బ్రాండింగ్ ఎంతో ముఖ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. రైజ్ కేంద్రం ద్వారా అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలను మహిళలు సద్వినియోగం చేసుకుని తమలోని ప్రతిభను వెలికితీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. శిక్షణ ద్వారా పొందిన నైపుణ్యాలను ఆదాయ వనరులుగా మార్చుకుని, కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడంతో పాటు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే స్థాయికి మహిళలు ఎదగాలని ఆకాంక్షించారు. మహిళలకు అవసరమైన శిక్షణ, మార్గదర్శకత్వం, ఆర్థిక సహకారం అందించడం ద్వారా వారిని స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ ఏఎన్వీ నాంచారరావు, రైజ్ మేనేజర్ బి. తేజస్విని, డీఆర్డీఏ సిబ్బంది, రైజ్ కేంద్రం సిబ్బంది, శిక్షణ పొందిన మహిళలు తదితరులు పాల్గొన్నారు.












# స్వచ్ఛ కృష్ణా జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలి

- **స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలి**
- **జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ ఎం. నవీన్**



**మచిలీపట్నం: ఆగస్టు 21,(మనం న్యూస్):** జిల్లాలో స్వచ్ఛతను మరింత మెరుగుపరిచి స్వచ్ఛ కృష్ణా జిల్లాగా తీర్చిదిద్దే లక్ష్యంతో శనివారం నిర్వహించనున్న స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రజలు, ప్రజాప్రతినిధుల విస్తృత భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ ఎం. నవీన్ అధికారులను ఆదేశించారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహణపై శుక్రవారం సాయంత్రం మచిలీపట్నంలోని తన క్యాంపు కార్యాలయం నుంచి జడ్పీ సీఈవో, జిల్లా పంచాయతీ, మున్సిపల్, జిల్లా అధికారులతో ఇంచార్జ్ కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో తీసుకుని ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు. అన్ని శాఖల జిల్లా అధికారులు, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, జిల్లా పంచాయతీ అధికారి, జెడ్పీ సీఈఓ, మున్సిపల్ కమిషనర్లు తం పరిధిలోని సిబ్బందిని సమన్వయం చేసుకుని కార్యక్రమంలో విస్తృతంగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లా పరిధిలోని జాతీయ రహదారులకు ఇరువైపులా ఉన్న ప్రాంతాలను ప్రత్యేకంగా పరిశీలించి చెత్త, వ్యర్థాలు లేకుండా పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని ఇంచార్జ్ కలెక్టర్ ఆదేశించారు. జాతీయ రహదారుల వెంట ఉన్న బ్లాక్ స్పాట్లను గుర్తించి ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి వాటిని గ్రీన్ స్పాట్లుగా మార్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి బ్లాక్ స్పాట్కు స్పష్టమైన బాధ్యతలు కేటాయించి, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది సమన్వయంతో శాశ్వతంగా పరిశుభ్రత కొనసాగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఉపరాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో ఆయన ప్రయాణించే మార్గానికి ఇరువైపులా ఉన్న గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను మరింత పకడ్బందీగా నిర్వహించాలని ఇంచార్జ్ కలెక్టర్ ఆదేశించారు. రహదారుల వెంట ఎక్కడా చెత్త, వ్యర్థాలు కనిపించకుండా ప్రత్యేక దృష్టి సారించాలని, గ్రామాల పరిసరాలను పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈసారి స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రజలు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం అత్యధికంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఇంచార్జ్ కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి గ్రామం, వార్డు పరిధిలో పెద్ద ఎత్తున పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో స్వచ్ఛతపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమం అనంతరం చేపట్టిన పారిశుద్ధ్య కార్యక్రమాల వివరాలను సంబంధిత ఆన్లైన్ ప్లాట్ఫారంలో తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రజలు, ప్రజాప్రతినిధులు, చేపట్టిన పనులు తదితర వివరాలను సమగ్రంగా ఆన్లైన్లో పొందుపరచాలని సూచించారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని కేవలం ఒకరోజు కార్యక్రమంగా కాకుండా నిరంతర స్వచ్ఛతకు దారితీసేలా నిర్వహించాలని ఇంచార్జ్ కలెక్టర్ ఎం. నవీన్ పిలుపునిచ్చారు. టెలి కాన్ఫరెన్స్లో వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

# ఉయ్యూరు, పరిసర ప్రాంతాల్లో అధికారులు విస్తృత తనిఖీలు

- **నీరు, ఆహార నమూనాల సేకరణ - 7 నుంచి 10 రోజుల పాటు నిరంతర తనిఖీలు**



**ఉయ్యూరు,విజయవాడ: ఆగస్టు 21, మనం న్యూస్:**ఉయ్యూరు పట్టణం, పరిసర ప్రాంతాల్లో కొంతమంది ప్రజలు వాంతులు, విరేచనాలు వంటి డయేరియా లక్షణాలతో వైద్య సేవలు పొందుతున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కృష్ణాజిల్లా ఇంచార్జ్ కలెక్టర్ ఎం. నవీన్ ఆదేశాల మేరకు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, పంచాయతీ అధికారులు సమన్వయంతో ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. డయేరియా లక్షణాలు ప్రబలడానికి గల కారణాలను గుర్తించేందుకు సంబంధిత శాఖల అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉయ్యూరు, పరిసర ప్రాంతాల్లో ఫుడ్ సేఫ్టీ అధికారి రవీంద్రారెడ్డి నేతృత్వంలో అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. బాధితుల ఇళ్ల పరిసర ప్రాంతాల నుంచి 4 నీటి నమూనాలు, సమీపంలోని హోటళ్ల నుంచి 5 ఆహార నమూనాలను అధికారులు సేకరించారు. ఈ నమూనాలను విశ్లేషణ కోసం చెన్నైలోని ఎన్ఏబిఎల్ గుర్తింపు పొందిన ప్రయోగశాలకు పంపించారు. ప్రయోగశాల నివేదికలు అందిన అనంతరం ఆహారం, నీటి నాణ్యతకు సంబంధించిన అంశాలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. తనిఖీల సందర్భంగా నిషేధిత సింథటిక్ ఫుడ్ కలర్ ఉపయోగించి తయారు చేసిన సుమారు 10 కిలోల గోబీ మంచూరియన్, చికెన్ వంటకాలను అధికారులు గుర్తించి ధ్వంసం చేశారు. ఫుడ్ లైసెన్స్ లేకుండా హోటల్ నిర్వహిస్తున్న ఒక వ్యాపార సంస్థకు నోటీసు జారీ చేశారు. ప్రజలకు సురక్షితమైన ఆహారం, తాగునీరు అందేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఉయ్యూరు, పరిసర గ్రామాల్లో రానున్న 7 నుంచి 10 రోజుల పాటు ఫుడ్ సేఫ్టీ అధికారులు నిరంతర తనిఖీలు నిర్వహించనున్నారు. అనుమానాస్పద ఆహార పదార్థాల నమూనాలను సేకరించి ప్రయోగశాలలకు పంపించడంతో పాటు, నిబంధనలు ఉల్లంఘించే హోటళ్లు, ఆహార విక్రయ కేంద్రాలపై నిబంధనల మేరకు చర్యలు తీసుకోనున్నారు.డయేరియా లక్షణాలతో బాధపడుతున్న ప్రజలకు వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల పర్యవేక్షణలో అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మరిగించి చల్లార్చిన లేదా సురక్షితమైన తాగునీటిని మాత్రమే వినియోగించాలని, ఆహార పదార్థాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులు సూచించారు. నీరు, ఆహార నమూనాల ప్రయోగశాల పరీక్షల ఫలితాలు అందిన అనంతరం మాత్రమే అనారోగ్యానికి ఖచ్చితమైన కారణంపై నిర్ధారణకు రావచ్చని అధికారులు స్పష్టం చేశారు. ప్రజలు ఆందోళన చెందకుండా అప్రమత్తంగా ఉండాలని, అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని వైద్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.



# బురద రోడ్లుతో తీవ్ర ఇబ్బందులు



**విస్సన్నపేట,ఆగష్టు21(మనం న్యూస్):** విస్సన్నపేట కమ్మటూరు యాదవుల బజార్లో తారు రోడ్డు మట్టి రోడ్డును తలపిస్తోంది. దీంతో నిత్యవసరాలకు రాకపోకలు సాగించలేక ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. వర్షాకాలం కావడంతో పలు రోడ్లు బురద మయంగా ఉన్నాయంటున్నారు. వాహనాలు బురదలో తిరగడం వలన పాడైపోతున్నాయని, మురుగు వల్ల దోమలు వృద్ధి చెందుతున్నాయన్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# పారిశుద్ధ్య కార్మికులతో ఎమ్మెల్యే మాటామంతీ




**తిరువూరు,ఆగష్టు21(మనం న్యూస్):** తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు శుక్రవారం ఉదయం పట్టణంలో వాకింగ్కు వెళ్లారు. మార్గం మధ్యలో పారిశుద్ధ్య కార్మికులను ఆప్యాయంగా పలకరించారు. వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. పట్టణ పరిశుభ్రతలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో వారు అందిస్తున్న సేవలను అభినందించారు.

# కొండచిలువ సంచారంతో ప్రజలులో భయ,బ్రాంతులు



**చందర్లపాడు,ఆగష్టు21(మనం న్యూస్):** చందర్లపాడు మండలం కోనయపాలెం శివారులో గురువారం రాత్రి కొండచిలువ కనిపించడం రైతులను భయాందోళనకు గురిచేసింది. గ్రామ శివారులోని పొలంలో సంచరిస్తున్న కొండచిలువను గమనించిన రైతులు వెంటనే అప్రమత్తమయ్యారు. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా అటవీ ప్రాంతాల నుంచి పాములు జనావాసాలు, వ్యవసాయ పొలాల్లోకి వస్తున్నాయని స్థానికులు తెలిపారు. ముఖ్యంగా పొలాలకు వెళ్లే రైతులు, వ్యవసాయ కార్మికులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

# అంకమ్మతల్లికి కరెన్సీ నోట్లతో అలంకరణ



**కంచికచర్ల,ఆగష్టు21(మనం న్యూస్):**శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం సందర్భంగా కంచికచర్ల మండలం, గొట్టుముక్కల శ్రీ అంకమ్మ తల్లిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. అమ్మవారి అలంకరణకు రూ.4.50 లక్షల విలువైన కరెన్సీ నోట్లను వినియోగించారు. ఆలయ ముఖ మండపాన్ని నోట్ల తోరణాలతో అందంగా తీర్చిదిద్దారు. భక్తులు తెల్లవారుజాము నుంచే అమ్మవారిని దర్శించుకొన్నారు. ధనలక్ష్మి అమ్మవారిని దర్శించుకుంటే అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని భక్తులు విశ్వసించారు.

# పాత బస్టాండ్లో గుంతతో తీవ్ర ఇబ్బందులు



**నందిగామ,ఆగష్టు21(మనం న్యూస్):** నందిగామ పాత బస్టాండ్లో గుంతను పూడ్చకుండా తాత్కాలికంగా ట్రాఫిక్ గేట్ ఏర్పాటు చేశారు. దీంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గుంత కారణంగా వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. ప్రమాదాల ముప్పు కూడా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుంతను శాశ్వతంగా పూడ్చి, రహదారికి మరమ్మతులు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ప్రజలు కోరుతున్నారు.

# అధ్వానంగా కొండపర్వ ప్రధాన రహదారి



**విస్సన్నపేట,ఆగష్టు21(మనం న్యూస్):** విస్సన్నపేట మండలం కొండపర్వలో ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. రహదారిపై గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం కాలు పెట్టి నడవలేని పరిస్థితి ఉందని గ్రామస్థులు వాపోతున్నారు. సమస్యపై పలుమార్లు అధికారులకు అర్జీలు ఇచ్చినా స్పందన లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# కట్లేరు బ్రిడ్జిపై గళమెత్తిన ఎమ్మెల్యే కొలికపూడి



**తిరువూరు,ఆగష్టు21(మనం న్యూస్):** తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు గంపలగూడెం -కట్లేరు బ్రిడ్జి సమస్యపై నేడు అసెంబ్లీలో గళమెత్తారు. ఈ బ్రిడ్జి వలన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో తిరువూరు, గంపలగూడెం ప్రాంత ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను సభ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కొలికపూడి ప్రభుత్వాన్ని కోరారు.